క్లుప్తంగా

ఒక పంటకు బదులు మరో పంట నమోదు

అద్దంకి: మీ సేవా కేంద్ర నిర్వాకంతో పలువురు రైతులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన రైతులు పంటల బీమా చేయించుకునేందుకు పట్టణంలోని మీ సేవా కేంద్రానికి వెళ్లారు. ఆయా రైతులు తమ పొలంలో బెంగాల్ గ్రామ్ (పప్పు శనగ) వేసినట్లు దరఖాస్తులు గ్రామ వీఏఏ నమోదు చేసి పంపింది. అయితే మీ సేవా కేంద్రంలో దానికి బదులు వేరుశనగ అని నమోదు చేయడంతో తరువాత చూసుకున్న రైతులు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి కొత్రపాటి వెంకటకృష్ణ వివరణ కోరగా సదరు బీమా కంపెనీతో తాను మాట్లాడనని, కేంద్ర యజమానికి మెయిల్ పెట్టానని చెప్పారు. అయితే ఒకరసారి నమోదు అయిన తరువాత మళ్లీ మార్చడం వీలు కాదనే విషయం తమకు తెలియవచ్చిందని పేర్కొన్నాడు.

17న పాపరాజుతోటలో పెన్షనర్స్ డే

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చీరాల యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల 17న స్థానిక పాపరాజుతోటలోని ఎస్‌జె రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు, రిటైర్డు ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీఓ టి.చంద్రశేఖర్ నాయుడు, విశిష్ట అతిథులుగా డీఎస్పీ మహమ్మద్ మొయిన్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామానాయుడు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమానికి పెన్షనర్లు అందరూ హాజరుకావాలన్నారు.

ముగిసిన పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

బల్లికురవ: సమగ్ర సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా గ్రామాలను అభివృద్ధి పరుచుకోవాలని రిసోర్సు పర్సన్ షేక్ మీరావలి అన్నారు. స్థానిక పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు సచివాలయ సెక్రటరీలు, సిబ్బందికి గురువారం ప్రారంభమైన శిక్షణ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. ఈవోఆర్డీ దాసరి సుమతి మాట్లాడుతూ రోడ్లు గ్రామాల్లో రోడ్లు, తాగునీరు పారిశుద్ధ్య కార్యక్రమాలు వీధిపాలు, ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పరుచుకోవాలని కోరారు.

టమోటా వాహనం బోల్తా



టమోటాలను బాక్సులకు సర్దుతున్న స్థానికులు

మార్టూరు: జాతీయ రహదారిపై టమోటా లోడుతో వెళ్తున్న వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈఘటన శుక్రవారం కోనంకి ఇసుక దర్శి గ్రామాల మధ్య జరిగింది. అందిన వివరాల మేరకు.. గుంటూరు నుంచి ఒంగోలు వైపు టమోటా పండ్ల లోడుతో వెళ్తున్న ఆటో ఇసుక దర్శి కోనంకి గ్రామాల మధ్య అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరు గాయపడక పోవటంతో రోడ్డుకు అడ్డంగా పడిన టమోటాను బాక్సులకు ఎత్తుకొని వేరే వాహనంలో తరలించారు. స్థానికులు హైవే సిబ్బంది సహకారంతో బోల్తా పడిన ఆటోను రహదారి పక్క మార్జిన్ లోనికి తరలించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేశారు.

పోలీసు స్టేషన్‌లో గుర్తు తెలియని బాలుడు



యద్దనపూడి: ఏడుస్తూ తిరుగుతున్న గుర్తు తెలియని బాలుడిని ఓవ్యక్తి గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. ఎస్సై రత్న కుమారి వివరాల మేరకు.. పూనూరు-గన్నవరం గ్రామాల మధ్య శుక్రవారం ఉదయం ఒంటరిగా ఏడుస్తూ నడిచి వెళ్తున్న బాలుడిని గమనించిన ఓ వ్యక్తి బాలుడు వివరాల కోసం ప్రయత్నించగా తన వివరాలు ఏమి చెప్పలేకపోవటంతో పోలీస్‌స్టేషన్‌లో ఆ బాలుడిని అప్పగించాడు. ఎస్సై, సిబ్బంది బాలుడిని ఏమి అడిగినా తన వివరాలు ఏమి చెప్పలేకపోవటంతో పోలీస్ సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాల్లో ఆ బాలుడి గురించి విచారించారు. ఆ బాలుడి గురించి ఎటువంటి వివరాలు లభ్యం కాకపోవటంతో శుక్రవారం రాత్రి ఐసీడీఎస్ సిబ్బందికి ఆ బాలుడిని అప్పగించారు. ఐసీడీఎస్ సంరక్షణలో ఉన్న ఆ బాలుడి ఆచూకి తెలిసిన వారు 91211 02153 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలు

చీరాల టౌన్: మండల పరిధిలోని సాగునీటి సంఘాల యూనియన్ ఎన్నికలను శనివారం చీరాలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ శుక్రవారం తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు చీరాల పట్టణంలో ఎస్ఆర్ అండ్ వీఎం హైస్కూల్, రూరల్ మండలంలో ఈపురుపాలెం బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, గవినివారిపాలెం జెడ్పీ హైస్కూల్‌ను కేంద్రాలుగా ఎంపిక చేశారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు గుంపులుగా చేరకుండా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని తహశీల్దార్ తెలిపారు.

రక్తమోడుతున్న రహదారులు

- నిర్లక్ష్యంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న వైనం
- అతివేగం, నిర్లక్ష్యం ప్రమాదాలకు ప్రధాన కారణం
- రెండు నెలల్లో 10 మందికి పైగా మృతి
- కుటుంబాల్లో విషాదాలు నింపుతున్న ప్రమాదాలు

చినగంజాం:

అతి వేగం.. నిర్లక్ష్యం రోడ్డు ప్రమాదాలకు ప్రధానంగా కారణమవుతున్నాయి. దేశంలో లక్షలాది మంది ప్రాణాలను రోడ్డు ప్రమాదాలు కబళిస్తున్నాయి. ప్రతి ఏడాది లక్షల కుటుంబాలు రోడ్డు ప్రమాదాలు కారణంగా చిన్నాభిన్నం అవుతుండగా ఎంతో మంది దివ్యాంగులుగా మారుతున్నారు. అతి వేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, సీట్ బెల్ట్ ధరించక పోవడం వంటి కారణాలతో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. వీటితో పాటు డ్రైవర్ నిర్లక్ష్యం, రాంగ్ రూట్ డ్రైవింగ్, నడిపే వాహనాల లోపాలు, రోడ్ల లోపాలు, మద్యం తాగి వాహనాలను నడపడం, నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై వాహనాల పార్కింగ్ ప్రమాదాలకు ప్రధాన కారణాలవుతున్నాయి. ఎక్కువ ప్రమాదాలు జాతీయ రహదారులపైనే జరుగుతున్నాయి. ఎన్నో లక్షలాది కుటుంబాలలో విషాదాలను నింపుతున్నాయి. సాంకేతిక పెరుగుదలను అందుకోలేని పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదాలకు కారణాలు పెరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో మానవ తప్పిదాలు 99 శాతం ఉంటున్నాయి. 30 ఏళ్లలోపు ఉన్న యువత ఎక్కువగా ప్రమాదాలు గురవుతున్నారు. ఫలితంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళల ప్రాణాలను బలిగొన్న ఆటో (ఫైల్)



డ్రైవర్ నిర్లక్ష్యంతో కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు (ఫైల్)



పర్చూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒకే కుటుంబంలోని సభ్యులు (ఫైల్)

నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన ప్రమాదాలు..

- పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం వద్ద డిసెంబర్ 8వ తేదీన రహదారిపై ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు తల్లి, కూతురు, అల్లుడు, బుడేమా, అమీరూన్, మస్తాన్‌వలిలు ఎదురుగా అతివేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో దుర్మరణం చెందారు. ఇందులో అమీరూన్ అనే మహిళ గర్భిణి. అదే రోజు మరో ప్రమాదంలో వెనుక నుండి అతివేగంగా వస్తున్న టిప్పర్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న తూమాటి సుబ్బయ్యను బలంగా ఢీ కొనడంతో తలపగిలి అక్కడికక్కడే మరణించాడు.
- చినగంజాం వద్ద డిసెంబర్ 4వ తేదీన జాతీయ రహదారిపై కూలీ ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలు రేపూరి సుమలత, షేక్ మస్తానీలు ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆగిఉన్న ట్రాక్టర్ ట్రక్‌ను ఢీకొని తలకు తీవ్రగాయాలై మృత్యువాత పడ్డారు. పలువురు మహిళలకు గాయాలయ్యాయి.
- పర్చూరు మండలం గణపవరం గ్రామానికి చెందిన జంపని ప్రసాద్ నవంబరు 25వ తేదీన రాత్రి వేళ నిర్లక్ష్యంగా ద్విచక్రవాహనం నడుపుతూ పర్చూరు రోడ్డులో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఢీకొని మృతి చెందాడు.
- ఇక హెల్మెట్ లేకపోవడంతో ఓవ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. చినగంజాం జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన మారెళ్ల సదాశివరావు నవంబరు 5వ తేదీన హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవర్ నడుపుతూ లారీని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- చినగంజాం మండలంలో పూలవారిపాలెం వద్ద అక్టోబరు 24వ తేదీన బహిర్భూమికి వెళ్తున్న సోమిశెట్టి మహాలక్ష్మిని ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ ఢీ కొట్టిన ఘటనలో ఆమె మృతి చెందింది.
- ఓ స్కూల్ బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ అక్టోబరు 28వ తేదీన నిర్లక్ష్యంగా బస్సును నడిపి 40 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సుతో పాటు పంట కాలువలోకి దూసుకెళ్లాడు. విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. లేకపోతే పెను ప్రమాదం సంభవించేది.

ప్రమాదాల నివారణకు మరింత అవగాహన అవసరం..

ప్రభుత్వం ప్రమాదాలు తగ్గించాలనే విషయంలో సవాల్ తీసుకొని చేస్తే తగ్గించవచ్చు. ప్రమాదాల నివారణకు రోడ్డు నియమాలు తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేయాలి. లైసెన్స్ జారీ నిబంధనలు విధిగా పాటిస్తూ ప్రభుత్వం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలి. దీని ద్వారా కచ్చితంగా ప్రమాదాలు తగ్గుతాయి. అందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సాయంతో ప్రమాదాల నివారణ పట్ల ప్రచారం విస్తృతం చేయాలి. పాఠశాలల్లో పాఠ్యాంశాలు ప్రవేశ పెట్టాలి. హెల్మెట్ లేనిదే పెట్రోలు లేదనే నినాదం తీసుకొని రావాలి. మీడియా, సెల్‌ఫోన్, ఎఫ్ఎం రేడియా, సినిమాహాలు యాడ్‌లు ద్వారా ప్రచారం చేయాలి.



చినగంజాం వద్ద రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకున్న యువకుడు (ఫైల్)



పర్చూరు వద్ద టిప్పర్ ఢీకొట్టడంతో మృతి చెందిన వృద్ధుడు (ఫైల్)

ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకుంటున్నాం..



రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు శాఖాపరంగా తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, హెల్మెట్ పెట్టక పోవడం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. జాతీయ రహదారి నిర్వాహణ లోపాలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి పూట లైట్లు వెలిగించకపోవడం, రోడ్ల గుంతలు ఉంటున్నాయి. ఈవిషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శీలం రమేష్, ఎస్సై, చినగంజాం

రైతుల ఆందోళనకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



చీరాలలో ఆందోళనకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బాపట్ల తరలివెళ్తున్న పర్చూరు వైఎస్సార్ సీపీ నాయకులు

చీరాల: రైతాంగ సమస్యలను పరిష్కరించి అన్నదాతలకు అండగా నిలిచి పెట్టుబడి సాయం అందించాలనే డిమాండ్‌తో బాపట్ల కలెక్టర్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ చేపట్టిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' నిరసన కార్యక్రమానికి చీరాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు తరలి వెళ్లారు. శుక్రవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కార్యక్రమానికి చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాలతో పార్టీ నాయకులు కార్లలో బాపట్లకు తరలి వెళ్లారు. చీరాల నియోజకవర్గం 200 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు బాపట్ల వెళ్లి ఆందోళనలో పాల్గొన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీమంత్రి మేరుగ నాగార్జున, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జులతో కలిసి రైతుల సమస్యలపై ఆందోళనలో పాల్గొన్నారు. బాపట్లకు వెళ్లిన వారిలో రూరల్ అధ్యక్షుడు ఎ.అంకాళరెడ్డి, పార్టీ నాయకులు గవిని శ్రీనివాసరావు, యాతం మేరిబాబు, కె.రమణారెడ్డి, నాగిరెడ్డి, అబ్రహం, వాసిమళ్ల వాసు, శ్రీను, తదితరులు ఉన్నారు.

చినగంజాం నుంచి..

చినగంజాం: జిల్లా కేంద్రం బాపట్లలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ధర్నాకు పర్చూరు నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో నాయకులు, రైతులు తరలి వెళ్లారు. నియోజక వర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్‌లు, ఎంపీపీలు, సీనియర్ నాయకులు ధర్నాకు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు, పర్చూరు మాజీ ఎంపీపీ కొల్లా వెంకటరావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలెపోగు రాంబాబు, చినగంజాం మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, భాగ్యరాజు, జీ రవీచంద్, బాబు నాయక్, మోషే నాయక్, హేమంత్ కుమార్ రెడ్డి, ఇంకొల్లు పార్టీ కన్వీనర్ బండారు ప్రభాకరరావు, మాచవరపు రవికుమార్, స్థానిక మండలాల రైతులు పాల్గొన్నారు.

సాక్షి పాత్రికేయులపై దాడి దారుణం



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఫిర్యాదు పత్రం అందజేస్తున్న పర్చూరు విలేకరులు



అద్దంకిలో డీటీకి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

సాక్షి నెట్‌వర్క్: వైఎస్సార్ జిల్లాలో కడప జిల్లా వేములలో వార్త కవరేజ్‌కు వెళ్లిన సాక్షి విలేఖరులను టీడీపీ గూండాలు దాడి చేసి గాయపరచడాన్ని నిరసిస్తూ శుక్రవారం అద్దంకి, చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో పాత్రికేయ సంఘాలు అధికారులకు వినతి పత్రం అందించారు. అనంతరం దాడి చేసిన టీడీపీ శ్రేణులకు కఠినంగా శిక్షించాలని వారు నినాదాలు చేశారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం



గుంటుపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

చీరాల టౌన్: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు సత్వరంగా పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఉపయోగకరమని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఈపురుపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఉన్న వివిధ రకాల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. భూ సమస్యలైన ఆన్‌లైన్, అడంగళ్, 1-బీ, మ్యుటేషన్ తదితర అన్నీ సమస్యలకు ప్రజలు తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు అందిస్తే నిర్ణీత కాలంలో పరిష్కారం చూపుతామన్నారు. రెవెన్యూ రికార్డులు అన్నింటిన భద్రంగా ఉంచి ప్రజల సమస్యలను పరిష్కరించేందు ఏర్పాటు చేసిన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈపురుపాలెం రెవెన్యూ గ్రామం పరిధిలోని వివిధ రకాల భూ సమస్యలపై ప్రజలు తమ అర్జీలను అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ దేవతోటి అర్జున్, మండల సర్వేయర్ బ్రాహ్మణయ్య, వీఆర్వోలు కృష్ణారెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గుంటుపల్లిలో..

బల్లికురవ: గ్రామాల వారీగా రైతుల భూసమస్యల పరిష్కారానికే రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం రవినాయక్ తెలిపారు. గుంటుపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలకు సంబంధించి రైతులు అర్జీలు అందజేశారు. అర్జీలను పరిష్కరించి చర్యలు చేపడతామని తహసీల్దార్ వివరించారు. డీటీ రవికుమార్, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పర్చూరు (చినగంజాం): సంకల్ప్ 2025లో భాగంగా ప్రభుత్వ బీఏఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేషుకుమారి తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరక్టర్ శుక్లా ఆదేశాల మేరకు శుక్రవారం విద్యార్థులకు ఏబీసీ కేటగిరిలుగా విభిజించి వారికి 2025 మార్చిలో జరిగే ఇంటర్ స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఇక నుంచి విద్యార్థులకు ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 3 గంటల వరకు రెగ్యులర్ కాలేజీ ఉంటుందన్నారు. 3 గంటలు నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కళాశాల సిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ వెంకట్రావు

కారంచేడు: ఎవరైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై వీ వెంకట్రావు పేర్కొన్నారు. చీరాల-ఇంకొల్లు దండుబాట రోడ్డులో స్వర్ణ ప్రాంతంలో ఎస్సై ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ దండుబాట రోడ్డులో జరిగే అక్రమ రవాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఈ రహదారి ప్రధాన రహదారి కాకపోవడంతో అక్రమ రవాణాలు ఈ రహదారుల్లో జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. అక్రమ రేషన్ బియ్యం, అక్రమంగా జంతువుల రవాణా, అక్రమంగా ఇసుక రవాణా వంటి అనేక అక్రమ రాకపోకలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రజలను, వ్యవసాయ కూలీలను ఎక్కించుకొని ప్రయాణాలు చేస్తూ అనేక ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి వాహనాలకు జరిమానాలతో పాటు, అవసరమైతే కఠిన చర్యలకు కూడా వెనుకాడబోమన్నారు. ద్విచక్రవాహనదారులు కూడా తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. సరైన పత్రాలు లేకుండా నడిపే వాహన యజమానుల నుంచి జరిమానా వసూలు చేసామని ఎస్‌ఐ తెలిపారు.

నమూన ప్రశ్నపత్రాల ఆవిష్కరణ



ప్రశ్నపత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్ఎస్‌సీ-2025 నమూన పరీక్ష ప్రశ్నపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం యూటీఎఫ్ చీరాల ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు చేతుల మీదగా ఆవిష్కరించారు. గత 15 సంవత్సరాలుగా యూటీఎఫ్‌చే ముద్రించిన నమూనా పరీక్ష పత్రాలు నుంచి పబ్లిక్ పరీక్షలలో 80 శాతానికి పైగా ప్రశ్నలు వస్తూ రాష్ట్రంలో ఎక్కువ మంది విద్యార్థులు పదోతరగతి పాస్ అవుతున్నారన్నారు. ఈ సంవత్సరం మారిన సిలబస్ ఆధారంగా రూపొందించిన పుస్తకాలను ఎక్కువ మంది విద్యార్థులు చేత చదివించి మంచి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.పాపారావు, జిల్లా కార్యదర్శి పి.సురేష్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.సీతారామరాజు, జిల్లా ఎయిడెడ్ కన్వీనర్ కుర్రా శ్రీనివాసరావు, హెచ్‌ఎం గుమ్మా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కాంస్య పతక విజేతకు సన్మానం



వేదశ్రీని సన్మానిస్తున్న రెడ్డి జనసేవా సంఘం ప్రతినిధులు

చీరాల అర్బన్: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన త్రిపురం వేదశ్రీకి రెడ్డి జనసేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానాన్ని నిర్వహించారు. నవంబర్ 22న తమిళనాడులోని సేలంలో జరిగిన దక్షిణ భారత అండర్-17 బాలికల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో త్రిపురం వేదశ్రీ కాంస్య పతకాన్ని సాధించిందన్నారు. వేదశ్రీ చీరాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతుందన్నారు. గతంలో పాఠశాల స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌లో రెండు బంగారు పతకాలు, ఏపీ ఓపెన్ మీట్‌లో ఒక బంగారు, రజతం, జాతీయ స్థాయిలో ఐదో స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా వేదశ్రీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు ఆరె గిరిధర గోపాలకృష్ణారెడ్డి, అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి జయభారత్‌రెడ్డి, సంఘ ముఖ్య సలహాదారు బత్తుల బ్రహ్మారెడ్డి, షణ్ముఖరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ వత్రం



అలంకరణలో స్వామివారు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం హనుమత్ వత్రాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా హనుమత్ మాల ధరించిన స్వాములు నియమనిష్టలతో దీక్షను పూర్తిచేసుకున్న 500 మంది స్వాములు దేవస్థానంలో వేదపండితులు సమక్షంలో మాల దీక్ష విరమించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రదక్షిణలు చేసి స్వాములు అందించిన ఇరుముడిలో ఉన్న అభిషేక ద్రవ్యాలతో స్వామివారి ఉత్సవ మూర్తికి అభిషేకాలు చేశారు. దేవస్థాన వేదపండితులు, అర్చకులు, దేవస్థాన ఏసీ తిమ్మానాయుడు, హనుమత్ వ్రత ఉభయదాత దేవస్థానంలో బావి వద్ద పూజ చేసి హనుమత్ వత్రాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం దీక్షా విరమణ చేసిన స్వాములకు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన ఏసీ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

జాబ్‌మేళాకు 49 మంది హాజరు

పర్చూరు (చినగంజాం): నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించే జాబ్ మేళాను, శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు బీఏఆర్ అండ్ టీపీ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సజ్జల శేషుకుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని పర్చూరు బీఏఆర్ అండ్ టీపీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు ప్రముఖ కంపెనీలు యాక్సిస్ బ్యాంక్, ఎస్బీఐ క్రెడిట్ కార్డ్స్, జీపీటీ, ఫ్లెక్స్‌టెక్ సొల్యూషన్స్, హెట్రో ల్యాబ్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. జాబ్ మేళాకు మొత్తం 49 మంది హాజరు కాగా వారిలో 19 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీ ప్రణయ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి బీ శ్రీనివాస్, పర్చూరు స్కిల్ హబ్ కో ఆర్డీనేటర్ పీ వినోద్ కుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

అద్దంకి: జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో అద్దంకి విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. ఇటీవల పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శ్రీరాములు జీవిత విశేషాలు అనే అంశంపై జిల్లాస్థాయిలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అద్దంకి అమృత ప్రథమ స్థానంలో, వ్యాసర రచన పోటీల్లో తృతీయ స్థానంలోనూ నిలిచిందని పాఠశాల హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. విద్యార్థిని బాపట్ల ఎంఈవో నిరంజన్, జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ సాధిక్, బాపట్ల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ఏ రమాదేవి, హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వంకాయలపాటి తిరుమల లక్ష్మి అభినందించారు.

మానవాళి రక్షణ కోసమే క్రీస్తు జననం



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

చీరాల రూరల్: మానవాళి రక్షణార్థం కోసమే యేసుక్రీస్తు జన్మించారని ప్రేమ హార్ట్, డయాబెటిస్ హాస్పటల్ అధినేత డాక్టర్ ఇస్తర్ల బాబురావు అన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్‌రావు, ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు ఆధ్వర్యంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ పిల్లి దేవదాసు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుని వాక్య సందేశం అందించారు. అనంతరం విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రీస్తు రాకను కాంక్షిస్తూ భక్తి శ్రద్ధలతో క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డు కరస్పాండెంట్ ఎన్. సదానందరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.